# ✶ యేసుక్రీస్తు అందరికి ప్రభువు

CHRISTAVANAADU
Telugu Fortnightly
e-mail: christavanaadu1@yahoo.co.in

Head Office : 17-108, Sanjay Gandhi Colony, Hanumanthavaka Junction, opp.L.V.Prasad Eye institute, Visakhapatnam - 40

Postal Regd. No. VSP-142/07-09
RNI APTEL /2006/17980

# క్రైస్తవనాడు

## ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

విశాఖపట్నం   సంపుటి : 2   సంచిక : 6   ఎడిటర్ : **వై. కనకరాజు**   2007 నవంబర్ 1-15   పేజీలు : 8   వెల : రూ. 5/-

**✶రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.**

**✶ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు.**




**✶దేవుడైన యెహోవా కరుణా వాత్సల్యములు గలవాడును, శాంతమూర్తియు, అత్యంత కృపగలవాడు...**

ఆయన వెనుకనున్న శిష్యులు విసిగినను, ఆయన విసుకక ఆమె కుమార్తెను స్వస్థపరిచారు. కేకలు వేస్తూ విసిగించినావెను మన ప్రభువైన యేసు అమ్మా అని పిలిచారు. ఎంత గొప్ప శాంత మూర్తాయన! అపిపించుటలేదూ.

యుూదులు విశ్రాంతి దినమున ఏ పనీచేయని ఆచారము గలవారిగా బైబిలు నందు కన బడతారు. ప్రభువైన యేసుక్రీస్తు కూడా యూదులే. విశ్రాంతి దినాన యేసు అప్పటికి 38 సంవత్సరముల నుండి వ్యాధితో బాధపడుచున్న ఒకని స్వస్థపరిచారు. అది విశ్రాంతి దినాన చేయుట వల్ల ఆచారముల ను ఆచరించు యూదులు దాన్ని తప్పుగా భావించిరి. స్వస్థపరిచిన వాడు యేసునుగూర్చి, ఆయన తనకు చేసిన మేలును గూర్చి చెప్పసాగెను. ఇందు నిమిత్తమై వారందరును "యేసును హింసించిరి" అయినను యేసు తన శాంతమును వారికి చూపి శాంతమూర్తిగా తన్ను తాను బయల్పరచుకొన్నారు. వారాయనను హింసిస్తే ఆయనేమో దేవుని కార్యాలను గూర్చి వారికి వివరించారు. విశ్రాంతి దినాన పని చేయుట తప్పుకాదని నిరూపించు టకు ఆయన తన తండ్రియైన దేవుని గూర్చి బయల్పరచారు. దేవుడు పనిచేయుచున్నారని, ఆలాగుననే కుమారుడైన నేనును పనిచేస్తున్నానని తెలియజేశారు. చిరాకుపడినట్లుగాని, వారిపై కోపపడినట్లుగాని బైబిలు నందు యోహాను సువార్త 5 అధ్యాయం 10 నుండి 18వ వచనం వరకు ఎక్కడను కానరాదు.

పుట్టుగ్రుడ్డియైనవానిని, ఆయన బాగుచేసి చూపునిచ్చారు. ఆ గ్రుడ్డివాడు బిక్షగాడు. ఈ విషయమై షరామామూలుగానే పరిసయ్యుల తెగవారు యేసును దూషించిరి. యేసుతోపాటు ఈసారి ఆ బిక్షగాన్ని కూడా దూషించిరి. గ్రుడ్డివాని సాక్ష్యం బలంగా ఉండుట వల్ల వారేమి అనక తెగింపలేదు. గ్రుడ్డివాన్ని మాత్రం నీవు కేవలము పాపిపై పుట్టినవాడవనిరి. యేసు కూడా పాపియని మేమెరుగుదుము అని పలికిరి.

2లో...



పారిశ్రామికాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం... 2లో...
దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం 3లో...
సేవకులెవరు? 4లో...
సంఘాలలో... బోధకుల- విశ్వాసుల పాత్ర చాకిరేవు 5లో...
మినిస్ట్రీలు చేస్తున్నదేమిటి? చేయవలసినదేమిటి? స్వార్థం స్వప్రయోజనం లేని ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులు 7లో...
యుపిఎఫ్ పరిచర్య వివరాలు 8లో...

# అటవీభూములు ఆదివాసులకే చెందాలి

## ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి



క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషిచేస్తుం దని, దీనిలో భాగంగానే 2006 అటవీహక్కుల పునర్వ్యవస్థీకరణ చట్టం (ఎల్‌టిఆర్) కింద రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల హెక్టార్ల అటవీ భూములపై దశలవారీగా ఆదివాసీ లకు హక్కులు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రకటించారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధికి చేపట్టిన కార్య క్రమంలో భాగంలో లక్షన్నర ఎకరాల వ్యవసాయ భూమిని ఏడాదిలోగా సస్యశ్యామలం చేయాలని లక్ష్యంగా పెట్టు కున్నా మన్నారు. లక్షలాది ఎకరాల భూమిని గిరిజనుల పరం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి వారి కుటుంబాల్లో వెలుగులు నింపబోతుందన్నారు. ఎల్‌టిఆర్ చట్టం కింద 39,601 కేసులకి సంబంధించి 1,20,953 ఎకరాల భూములు ఇప్పటికే గిరిజనులకు తిరిగి దత్తంచేయడం జరిగిందన్నారు. వీటితో గిరిజనులు ప్రశాంతంగా సాగుచేసుకుంటు న్నారనీ, వీరికి ట్రైకార్ పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. స్థానిక బీళ్లు, బంజరుభూములను ఎక్కడికక్కడే గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిం దన్నారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని 30,262 ఎకరాల ప్రభుత్వ భూములను 16,127 మంది గిరిజనులకు ఇచ్చామని, హెక్టారు ఒక్కింటికి ఐదువేల చొప్పున ఖర్చుచేసి అభివృద్ధి పరచాలన్నది ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి తెలిపారు. గత మూడేళ్లలో 8.60 కోట్ల రూపాయలను ఖర్చుచేసి, 17,776 మంది గిరిజనులకు చెందిన 18,333 ఎకరాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో మరో 10వేల ఎకరాలను 5 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందిరప్రభ పథకం కింద 52,472 మంది గిరిజన రైతులకు చెందిన భూములను అభివృద్ధి చేసేందుకు 39 కోట్ల 47 లక్షల రూపాయలను ఖర్చుచేయడం జరిగిందని గిరిజనాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి నాగిరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు.

గిరిజనుల భూమి అభివృద్ధితో పాటు విద్యుత్‌సౌకర్యం, భూపరి రక్షణ, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారు లను ఆదేశించారు. గత మూడున్నర ఏళ్లలో 19 కోట్ల 46 లక్షల వ్యయంతో గిరిజనుల భూముల్లో 38,676 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, వచ్చే మూడేళ్లలో 20 కోట్ల 40 లక్షల రూపాయలతో 40వేల వ్యవసాయ బోర్లకు విద్యుత్‌సౌకర్యం కల్పిస్తా మన్నారు. రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద 18 కోట్ల 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 12,435 హెక్టార్లలో గిరిజనుల భూములకు సేద్యపు నీటి సౌకర్యాన్ని మెరుగుపరచడం జరిగిందన్నారు.

# కొత్త డి.జి.పి. శ్యామ్‌సుందర్ యాదవ్


కొత్త డిజిపి యాదవ్

క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌గా ఎస్ఎన్‌పి యాదవ్‌ను నియమించారు. 1972 బ్యాచ్‌కి చెందిన ఐపిస్ అధికారి యాదవ్ ప్రస్తుతం అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావే శంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 1972 బ్యాచ్ ఐపిఎస్ అధికారుల్లో పి.వి నాయుడు, కుమావత్, ఎస్ఎస్‌పి యాదవ్‌లలో ఎవరిని ఎంపిక చేస్తారనే విషయంలో తర్జన భర్జనలు జరిగాయి. ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటించిన సీనియారిటీ ప్రకారం పి.వి. నాయుడుకే డిజిపి పదవి అప్పగించాలని భావించినా ఆయన మరో 8 నెలల్లోనే రిటైర్డ్ కానున్నారు. ఎన్నికలకు ముందు మరో డిజిపిని నియమించాల్సిన అవ సరం ఉండటంతో కొద్ది కాలానికి నాయుడుకు అవకాశం ఇవ్వలేదని భావిస్తున్నారు. అంటే 2008 జూన్ నాటికి నాయుడు పదవి విరమణ చేస్తారు. పార్లమెంటుకు మధ్యంతర ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఊహలు వెలువడుతున్న సమయంలోను మరొకపక్క 2009 ఏప్రిల్ నాటికి రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సన్నద్ధం కావాల్సి ఉండగా ఈ దశలో నాయుడుకే పట్టం కట్టడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలుస్తున్నది.

**✶ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరం**

# ✶ నేనే ఉన్నాను నేను తప్ప మరి ఎవరును లేరు



*(మొదటి పేజీ తరువాయి...)*

అయినను ప్రభువు వారినేమి అనక తన కార్యములను ముగించు చుండెను. ఆయనెల్లప్పుడు దేవుని కార్యాలందే ఆశక్తి కనబర్చుతు వారందరియెడల శాంతమూర్తిగా వర్థిల్లెనని యోహాను సువార్త 9 అధ్యాయం 1 నుండి 34 వచనాలు తెలుపుతాయి.




శిలువలో ఉన్నప్పుడైతే ఆయనకు అటుఇటున్న దొంగలు సహితం ఆయనను దూషించిరి. అట్టివారిలో ఒకని ఆయన రక్షించినట్లు చూస్తాం. రక్షణ ప్రసాదించి తనతోపాటు పరదైసులో ఉండుభాగ్యన్ని అనుగ్రహించినట్లు చూస్తాం. అంతటి శాంతమెవ్వరికి సొంతం! మన ప్రభువైన క్రీస్తుయేసుకు తప్ప.

శిలువకు ముందు ముండ్ల కిరీటము అల్లి ఆయనకు పెట్టి యూదులరాజా, నీకు శుభమని చెప్పి ఆయనకు వందనము చేసిరి. రెల్లుతో ఆయన తలమీద కొట్టిరి. ఆయన మీద ఉమ్మి వేసిరి. మోకాళ్ళూని ఆయనకు నమస్కరించి అపహసించిరి. ఆయనను ఎన్నివిధాలా అపహసించినను ఆయన శాంతమే కనబర్చారని మార్కు సువార్త 15 అధ్యాయం 17 నుండి 20 వరకు వ్రాయబడింది.

యేసును శిలువ వేసిరి. ఆయనను శిలువేసిన వారందరిని గూర్చి తండ్రియైన దేవునిని తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక క్షమించుమని ఆయన వేడుకున్నారు. వారందరు యేసునుగూర్చి ఎందరినో రక్షించెను తన్నుతాను రక్షించుకొనలేడా అని అపహసించిరి. నీవు యూదుల రాజువైతే నిన్ను నీవే రక్షించుకొనమని గేలి చేసిరి. వారెన్ని విధాలుగా తనను అపహసించినా గేలిచేసినా ఆయన వారిని గూర్చి ప్రార్థించిన శాంతమూర్తిగా కన్పిస్తారు. ఈ విషయాలు లూకా సువార్త 23 అధ్యాయం 33 నుండి 38 వచనం వరకు మనకు కనబడతాయి.

చారిత్రక గ్రంథమైనది గా పరిగణింపబడు బైబిలునందు క్రీస్తును శాంతమూర్తిగా ఘనపర్చు ఇటువంటి వివరణలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్నిటిని వివిా ముందుకు తీసుకొచ్చాం. పత్రిక కొరకు మా కొరకు ప్రార్థించుడి. రాబోవు సంచికల్లో మరిన్ని ఆశక్తికర అంశాలు వివరిస్తాము.

## పారిశ్రామికాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం

'క్రైస్తవనాడు ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖ మంత్రి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. హెల్త్ సిటీ, విమ్స్ నిర్మాణానికి రూ. 120 కోట్లు మంజూరు చేశామని, కంటి ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 8600 కోట్లతో స్టీల్‌ప్లాంట్ విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఎన్‌టిపిసి, పోర్టు ట్రస్ట్ విస్తరణలు విమానాశ్రయ అభివృద్ధికి రూ. 194 కోట్లతో చేపట్టిన పనులు వచ్చే జూన్ 2008 నాటికి




3లో...


**Rev. Dr. M.A. Paul**
Founder President:
**New Convenant Keepers,Chirist'sChurch**
President :
**United Christian Association - Visakhapatnam**
Chairman:
**All IndiaChristian Council, Visakhapatnam Dist.**
Former Deacon - Trinity Lutheran Church




**THE DELIBERATE NEED OF OUR NATION AT PRESENT: CIVILIZATION OR EVANGELIZATION?**

**డా॥ఎం.ఎ.పాల్ ఆర్టికల్ ఇంగ్లీషులో క్రైస్తవనాడు మొదటి వార్షికోత్సవ సంచికలో వచ్చింది. దాని తెలుగు తర్జుమాను వారు మేమడిగిన వెంటనే ఇచ్చి సహకరించారు. "నాగరికతా? సౌవార్తీకరణా? ఏది దేశానికిప్పుడు అవసరం?" అను అంశంతో తెలుగులో మీ కోసం త్వరలో...**

– ఎడిటర్




**వాక్య అన్వేషకులకు శుభవార్త!!**

**సత్య సంస్థాపక సహవాసము వారి..**

**నూతన సంవత్సర క్యాలెండర్-2008**

★ క్యాలెండర్‌లో ప్రతిమాట ఆశ్చర్యం
★ ఈ క్యాలెండర్ ద్వారా దేవుని సంకల్పమును అనగా సంఘములో దేవుడు చేయుచున్న పనిని తెలియజేయాలనే ఉద్దేశ్యముతో ముద్రించడమైనది
★ ఈ క్యాలెండర్ విశ్వాసులను దేవుని సంకల్పములో నడిపిస్తుంది.

ఆసక్తిగలవారు సంప్రదించండి:
**పాస్టర్ వై.అంద్రెయ సత్యసంస్థాపక సహవాసము**
డోర్ నెం. 36-98-32, కంచరపాలెం (కప్పరాడ),
విశాఖపట్నం- 530 008, సెల్ : 9948496093



## క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు

| బ్లాక్ & వైట్‌లో | పూర్తి పేజీ | అరపేజీ | పావు పేజీ |
|---|---|---|---|
| ముందర పేజీ | ***** | 3,500/- | 2,000/- |
| మధ్య పేజీల్లో | 5,000/- | 2,800/- | 1600/- |
| చివరి పేజీ | 8,000/- | 4,500/- | 2,500/- |

| కలర్‌లో | పూర్తి పేజీ | అరపేజీ | పావు పేజీ |
|---|---|---|---|
| ముందర పేజీ | ***** | 8,000/- | 4,500/- |
| మధ్య పేజీల్లో | 8,000/- | 4,500/- | 2,500/- |
| చివరి పేజీ | 16,000/- | 9,000/- | 5,000/- |

వివరాలకు
సెల్ నెం.9346960601,9849134647 9393121588, 9866113513

**మీ ప్రకటనలు ఆంధ్రా అంతటా అనేక ప్రాంతాల్లో తెలుస్తాయని గమనించండి. 6 నెలలు లేక సంవత్సర కాంట్రాక్టుకు "ప్రత్యేక రిబేటుకై" ఎడిటర్‌ను సంప్రదించండి.**

**క్రైస్తవనాడు పాత పేపర్లు మిస్సయిన వారికి అపూర్వ అవకాశం !**

మొదటిసంచిక 2006 ఆగస్టు 20 నుండి వచ్చిన మొదటి సంవత్సర 24 క్రైస్తవనాడు పేపర్లు A-4 సైజ్ జెరాక్స్ కాపీలు అందమైన 'స్పైరల్ బైండింగు'తో లభించును. కావలసినవారు సంప్రదించండి. పోస్టేజీతో కలిపి రూ.400/- మాత్రమే. ఎం.ఓ. చేసి పొందండి.

**క్రైస్తవనాడు**
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

*కమిషన్‌పై మార్కెటింగ్ చేయుటకు ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించండి.*

*సెల్: 9346960601,9849134647*


**గమనిక**
✶ గుర్తువున్న వచనాలు పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లోనివి.

# ✶ ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడు

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



సంపుటి :2 సంచిక : 6 నవంబర్ 1-15, 2007

# సమయపాలన

**✶ దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక ఉపయోగము చేసికొనుచు, అజ్ఞానులవలే కాక జ్ఞానులవలే నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి.**

నేడు మన జీవన విధానం ఊహించనంత బిజీగా మారుతోంది. ప్రతివ్యక్తి పదినిముషాలు లేటయితే ఏమవుతుందోననే ఆత్రుతలోనే కనబడ్తున్నారు. సమయపాలనకు విలువ పెరిగింది. బద్ధకస్తులకు చోటులేదు. వారికి వెనుకబాటుతనం వద్దన్నా వచ్చేస్తుంది. అయితే ఈ జీవన విధానంలో మనిషి యంత్రంలా మారిపోతున్నాడని తద్వారా కుటుంబ జీవనం కుంటుబడుతుందని మానసిక వేత్తలు చెప్తున్నారు. దీనిని జయించుటకే నేడు ఎందరో అనేక మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎవరికి తోచిన మార్గం వారు ఎంచుకుంటున్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆనందంగా ఉండుటకు ప్రయాసపడుతున్నారు. అయినను ఎందరో అది పొందలేకపోతున్నారు. ప్రయాస ప్రయాసగానే మిగిలిపోతుందని స్పష్టంగా తెలుస్తుంది. చక్కని సమయపాలనతో జీవితాన్ని గడుపుటకు ఆధ్యాత్మికత ఒక్కటే సరైన మార్గమని అధికశాతం వారు అభిప్రాయపడుతున్నారు. నేటి యువతలో ఎక్కువ శాతంవారు ఆధ్యాత్మిక ధోరణి వైపు మళ్ళుట మంచి పరిణామమని ఆధ్యాత్మికవాదులు భావిస్తున్నారు. ఆధ్యాత్మికత చిన్ననాటినుండి పిల్లల కలవర్చితే వారు లోకాన ఎంతో ఉన్నతులుగా మారుతారనుటలో ఎటువంటి సందేహం లేదని చెప్తున్నారు. *ఆధ్యాత్మికంగా ఎదిగినవారెవ్వరైనా సమయపాలన పాటిస్తారని, తమ బ్రతుకులలో ప్రశాంతత కనబరుస్తారని విశ్వసించుటకు అవకాశమెక్కువని ఆధ్యాత్మిక వాదుల అభిప్రాయం.* కార్పోరేట్ జీవనంలో ఆధ్యాత్మికంగా బలంగా ఉన్నవారే చక్కగా నిలదొక్కుకో గలరనే భావన కనిపిస్తుంది. కార్పోరేట్ రంగంలో మానసిక వత్తిడి అధికమని తెలుస్తుంది. అందువల్లే అందున్న ప్రముఖులు వివిధ రకాల చారిటీలను స్థాపించి సమాజసేవ చేస్తున్నారని, ఆ విధంగా వారెంతో ఆనందం పొందుతుంటారని అభిప్రాయం. ఏదైతేనేం మొత్తానికి అందరు సమయపాలన విషయంలో జాగ్రత్త వహించాలి. అదే దేశ భవిష్యత్తుకు మూలం. సమయానికి ఉన్న విలువ అటువంటిది మరి. కాబట్టి మనమంతా సమయాన్ని పాటిద్దాం! ఎప్పటిపని అప్పుడే చేయుటకు ప్రయత్నిద్దాం!!
దేశాభివృద్ధిలో మనదీ ఒక పాత్రేననే విషయం ఎల్లవేళలా గుర్తుచేసుకుందాము.

వై.కె.

**"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తమును.........మా కొరకు ప్రార్థించుడి" (2 థెస్స 3:1)**

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం

**"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్సు సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలియజెప్పటకు చేయు ప్రయత్నమే ఈ "దేవునిజ్ఞానం - మానవ విజ్ఞానం" శీర్షిక ముఖ్యోద్దేశము.**

**18**

## భూమిని గూర్చి శాస్త్రవేత్తలు..... | భూమిని గూర్చి దేవుని గ్రంథంలో.....

### బైబిల్ × సైన్స్

మనుష్యులను భూమి మీద దేవుడు చేసి, స్వతంత్రమిచ్చి వారు చేసిన కార్యాలను బట్టి దేవునికొచ్చె ఘనతను చూచి ఆనందించాలని దేవుడు కొరుకున్నారు గాని వారి వల్ల వచ్చే చెడ్డపేరును దేవుడు కోరుకోవటం లేదు. దేవుడే కాదు భూమి మీద ఏ తండ్రి తన కుమారుని వలన మంచిపేరే గాని చెడ్డపేరును తెచ్చుకోవాలని అనుకోరు. దేవునికి సృష్టి ప్రారంభం నుండి మంచిపేరు కంటే చెడ్డపేరు వస్తునే ఉంది. అది దేవుడు సంతాపం చెందే విధంగా దారి తీసింది. ఇక మనుష్యులు మారరని దేవుడు మనుష్యులను చేసినందుకు హృదయములో నొచ్చుకొని భూమి అప్పటి వరకు ఉన్న ప్రతీది నాశనం చేయలని అనకున్నారు.

**✶ తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను.**

అప్పటికాలంలో వారిని వెంటనే నాశనం చేయలేదు. నోవాహు అనే భక్తునికి ఓడ సిద్ధపరచమని దాని పరిమాణం దానికి కావలసిన వస్తువులను కూడా చెప్పి రక్షణ సువార్త ప్రకటింపజేశారు. దేవుడు అక్కడ కూడా మనుష్యులమీద ప్రేమను బట్టి చివరిలోనైనా ఒకరైనా మారుతారని ప్రకటింపజేసాడు.

**✶దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవాహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారి యొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను.**

వారు మారుతారని దేవుడు ప్రకటింపజేస్తే వారు మారుట బదులు, హేళన చేయుట మొదలు పెట్టారు. గాని దేవుడిచ్చిన గడువు (ఓడకట్టిన దినాలు) పూర్తి అయిపోయినా ఒక్కరు కూడా మారక పోవటంతో దేవుడు జలప్రళయాన్ని భూమిపైకి రప్పించగా, భూమి మీద ఉన్న ప్రతి దానిని ఆ జలప్రళయం తుడిచి వేసింది. చిరవకు ఎనిమిది మంది ఆ జలప్రళయంలో నుండి రక్షింపబడ్డారు.

**✶ ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి.**

ఆ ఎనిమిది మందీ నోవాహు కుటింబీకులు, నోవాహు, ఆయనకు పుట్టిన ముగ్గురు కుమారులు (షేము, హాము, యాపెతు) ఆయన కోడళ్ళు మరియు ఆయన భార్య. అంటే ఆ ఇంటి వారే తప్ప బయటివారెవరు మారలేదని అర్ధమవుచున్నది. అంత పెద్ద ఓడను ఆ కుటుంబం నిర్మించలేదని మనం గ్రహించాలి. ఎందుకంటే ఒక అంతస్తు ఇల్లు కట్టడానికే పది ఇరవై మంది అవసరపడతారు. మరి అంత పెద్ద ఓడ కట్టించిన నోవాహు ఇంకెంత మంది పనివారిని పెట్టి ఉంటాడు? ఒకసారి ఆలోచించండి! అంటే ఆయన దగ్గర పనిచేస్తున్న ఓడ కట్టిన వారు కూడా మారలేదు. దేవుడు అబ్రహాముతో సొదోమా-గొమొర్ర పట్టణాలను నాశనం చేస్తున్నానని చెప్పినప్పుడు, ఆ ఊరిలో కనీసం 10మంది నీతిమంతులు వున్నా, నాశనం చేయకపోవును.

అలాగే దేవుడు నీనెవె పట్టణాన్ని నాశనం చేయబోతున్నానని ఆ ఊరి ప్రజలకు రాజులకు చెప్పమని యోనాని పంపించారు. గాని సొదొమా-గొమొర్ర పట్టణాలలో నీతిమంతులు దేవుడు చెప్పిన సంఖ్య కన్న తక్కువగా ఉన్నట్లు మనం గ్రహించుకోవాలి. కాబట్టి ఆ ఊరిని దేవుడు నాశనం చేసారు. నీనెవె పట్టణంలో నీతిమంతులు లేకపోయినను, ఆ వార్త విని పశ్చాత్తాపం చెంది రాజుతో సహా గోనెపట్ట కట్టుకొని దేవునికి మొర్రపెట్టుకున్నారు కాబట్టి వారు రక్షింపబడ్డారు. అదేవిధంగా నోవాహు కాలంలో ఉంటే దేవుడు నాశనం చేయకపోవును. ఎందుకంటే మారితే ఇష్టపడే దేవుడాయన. నాశనం చేయాలని దేవుడు ఎప్పుడు కోరుకొనరు. ఎందుకంటే నాశనం చేస్తే తనపిల్లలు తనకు దూరమైపోతారు. నరకాగ్నికి చేరువవుతారు. మారితే తన చెంతకు చేరుతారని దేవుని ఆశ. అందువలన ఆయన దీర్ఘశాంతంతో ఎదురుచూస్తున్నట్లు లేఖనాలు తెలియజేస్తున్నాయి. తన పోలికలో పుట్టిన పిల్లలు తిరిగి ఆయన యొద్దకు చేరాలని ఆయన ఆశ.

వివరణ: వై.ఎల్.రవిరాజు

# పారిశ్రామికాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం

**(2వ పేజీ తరువాయి...)**

పూర్తవుతాయన్నారు. ఇప్పటికే కొత్తరన్‌వే పనులను ప్రారంభించామన్నారు. రూ.95 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు కూడా త్వరలో పూర్తవుతున్నాయన్నారు. విశాఖనగరంలో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం కింద కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. విశాఖ నగరాన్ని పూరిగుడిసె రహిత నగరంగా తీర్చిదిద్దడానికి నగరంలో 33వేల నిరుపేద కుటుంబాలకు గృహాలు మంజూరు చేస్తున్నామని, గాజువాకలో మంచినీటిని అందించడానికి రూ.86 కోట్లు మంజూరుచేశామన్నారు. ఉద్యోగశ్రీ పథకం కింద వివిధ రంగాల్లో 1836 మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. విశాఖలో మౌలిక సదుపాయాల కోసం వుడా రూ.668 కోట్లతో 150 కిలోమీటర్ల మేర రోడ్లు వేస్తోందన్నారు. రూ.1100 కోట్లతో ప్రైవేటు భాగస్వామ్యంతో గృహాలను కూడా నిర్మిస్తున్నారన్నారు. రాంబిల్లి వద్ద ఐదు వేల ఎకరాలతో అదనపు నేవల్‌బేస్ పనులు చేపట్టామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.వీరబ్రహ్మయ్య, ఎమ్మెల్యేలు ద్రోణంరాజు శ్రీనివాస్, తిప్పల గురుమూర్తిరెడ్డి, గండిబాబ్జి, జెడ్పీ చైర్మన్ గొర్లె రామ్మూర్తినాయుడు, వుడా చైర్మన్ పి.ఎస్.ఎన్.రాజు, జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గుంటూరు నరసింహమూర్తి, నగర పాలక సంస్థ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా, రూరల్ ఎస్పి అకున్ సబర్వాల్, వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ స్మిత సబర్వాల్, డిసిపి విశ్వప్రసాద్, డిఆర్వో ఎన్.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, స్వాతంత్ర్య సమరయోధులు తదితరులు పాల్గొన్నారు.

**'క్రైస్తవనాడు'లో ప్రచురించిన బైబిలుకు సంబంధించి ఎటువంటి అంశాలపైనైనా మీకు సందేహాలుంటే మాకు ఉత్తరం వ్రాసి తగు వివరణ సంపూర్ణంగా పొందండి. మీ ఉత్తరాలు, దానికి మా ప్రత్యుత్తరం కూడా ఇదే శీర్షికలో మరెందరో ఎరుగునట్లు ప్రచురించబడతాయి. మీ అడ్రసు సంపూర్తిగా ఉండాలి. ఫోన్ నెంబర్ ఉంటే తప్పక ఇవ్వాలి.**

మీ అడ్వర్టైజ్‌మెంట్లు మొదలగువాటి విషయమై ఎడిటర్‌ను సంప్రదించగలరు.
ఎడిటర్ : వై.కె. రాజు, సెల్ : 9346960601,9849134647

# సేవకులెవరు?

ప్రియులారా ! నేటిదినాల్లో అనేకులు సేవకులుగా మనకి కనబడుతుంటారు. అయితే సేవ అంటే ఏమిటో తెలియని వారు కూడా సేవకులఅవతారమెత్తుతున్నారని ఎక్కువగా వినబడుతుంది సేవకొచ్చిన వారెవరికైనా ఉండవలసిన ముఖ్య లక్షణాల్లో తగ్గింపు ధోరణి ఒకటి. అన్నిటికంటే ప్రాముఖ్యమైనది వారు బైబిలును సంపూర్ణంగా ఎరుగుటకు ఇష్టపడాలి. దినదినం వాక్యంలో బలంగా ఎదగాలి. దీనికి అంతం అంటూ ఉంటే అది మన జీవితాలకు భూమిపై ముగింపు రోజు మాత్రమేనని గ్రహించాలి. నేడు ఎందరో సేవకులకు అసలు బైబిలులో కనీస జ్ఞానం కూడా ఉన్నట్లు అగుపడదనిపిస్తుంది. ఎందుకంటే ప్రభువు తన గ్రంథంలో తనను గూర్చిన విషయమేదైనా ఒకేచోట చెప్పలేదు. కొంత ఒకచోట ఇంకొంత మరోచోట చెప్పారు. మిడి మిడి జ్ఞానంగల సేవకులెందరో వాటిని సంపూర్ణంగా ఎరుగక ఏదో ఒకచోట ఉన్న వచనాన్ని చదివి బోధించేస్తారు. అదే వచనానికి సంబంధించిన సంపూర్ణ వివరణ ఇచ్చు వచనాలు ఇంకెక్కడున్నాయో వెదుకరు. అందువల్ల వారు బోధించినది అసంపూర్ణంగానే కనిస్తూ అనేక సందేహాలకు తావిస్తోంది. దానిలో సందేహమెవరైనా అడిగితే ఠక్కున వారిచ్చే సమాధానం అలా అడుగకూడదు బ్రదర్ అంటుంటారట! కొందరైతే ప్రార్థన చెయ్యండి అదే తెలుస్తుందని వింతగా జవాబిస్తారట! అదే నిజమైతే బైబిలు చదువుటెందుకు. మనకు అన్ని దేవుడే చెప్తాడుగా! మన ఎదురుగా వాక్యరూపాన బైబిలు ఉండగా అది చదివి గ్రహించక ప్రార్థన చెయ్యమనడం చోద్యంగానే అన్పిస్తుంది. మనకు అతీతమైన సంగతులను గూర్చి, మన బ్రతుకులకు సంబంధించిన వాటికోసం, మనయెడల సమస్తము చేయగల దేవునికి ప్రార్థించుట సబబుగా అనిపిస్తుంది. బైబిలును, అందున్న దైవ ఉద్ధేశ్యాలను ఎరుగుటకు దానిని మనం పూర్ణమనస్సుతో చదివి గ్రహించవలసిందే. అటువంటి ఆశక్తి ఉన్న యెడల దేవుడే కృపచూపి సమాధానమిచ్చు జ్ఞానంగలవారి యొద్దకు మనల్ని నడిపిస్తాడు. ఇది నేడు లోకంలో ఉన్న బైబిలు గ్రహించి బోధిస్తున్న వారెందరికో అనుభవమే. అలాంటివారు మాతో పంచుకున్న మాటల సారాంశమే ఈ వివరణ. *సేవకులలో కొందరు దర్శనమొచ్చింది అంటారు. కొందరు దేవుడు మాట్లాడారంటారు. ఇంకొందరు ఆత్మ వచ్చిందని పిచ్చిపిచ్చి కేకలు వేస్తుంటారు. ఆ సమయంలో వారేం మాట్లాడతారో ఎవరికీ అర్థంకాదు, అసలు వారికే అర్థంకాదు. దాన్ని చూసిన "అమాయక క్రైస్తవభక్తులు" వారు దేవునితో మాట్లాడుతున్నారని భ్రమపడతారు. వారిని గొప్ప దైవభక్తులుగా కొలచి తమకున్నదంతా వారికి దోచిపెడుతుంటారు.* ప్రియులారా! మీకొక విన్నపం... క్రైస్తవనాడు సేవకుల మంచిని గూర్చి మరియు వారు చేయు మోసపుమాటలగారడీని గూర్చి "లేఖనాల ప్రకారం" వివరిస్తుంది. చదివి గ్రహించి లేఖనప్రకారం జీవించువారిని మరెక్కువ సన్మానానికి పాత్రులని ఎంచి, సన్మానించండి. లేఖనాలకు భిన్నంగా సేవకులెవరైనా కనబడితే నిలబెట్టి ప్రశ్నించి సరిచేయండి. క్రీస్తునందు మనకు అదే ఆశీర్వాద కారణాల్లో ఒకటని గ్రహించండి. అంతేగాని *సేవకుల్ని ఏమైనా అంటే శాపాలు వస్తాయి అనే భ్రమలో ఉండకండి. వారిని ఖండించి, బుద్ధి చెప్పమని బైబిలే చెప్తుందని మీరెరగండి. నిజ సేవకుల్ని అంటే మీకేమైనా అవుతుంది అనుటలో అర్థముంది గాని సేవాముసుగులో దేశాలు పట్టి తిరుగుతూ ధనవంతులైన క్రైస్తవుల ఇండ్లదగ్గరే మకాం వేసేవారు సేవకులెలా అవుతారు? ఆలోచించండి!* మీ దగ్గరకొచ్చే సేవకుల్ని సేవాభారం ఉన్నవారా? కారా? అన్న విషయం మీరు చాలా సుళువుగా పరీక్షించి తెలుసుకోవచ్చు. అలా తెలుసుకోవాలంటే మీరు బైబిలును "ఆదివారం పుస్తకము" గా మాత్రమే చూడొద్దు. అది *"నిత్యం మనల్ని నడిపించు దేవుని శక్తి"*యని గ్రహించి దినదినం దానిలో ఎదగాలి. అప్పుడు దేవుని ఆశీర్వాదాలు దానంతట అవే వచ్చి మన తలుపు తడతాయి. మనల్ని బట్టి అనేకులు మనలా ఆలోచించువారుగా తయారయి దైవాశీర్వాదాలు పొందుతారు. మీదగ్గర కొచ్చిన సేవకులెవరైనా ముందుగా దేవుని గూర్చి మీ కుటుంబంతో మాట్లాడుతున్నారా? లేక మీ కుటుంబ విషయాలతో ఆనందంగా మిమ్మును మభ్యపెట్టి "తనపని" తాను జరుపుకొని వెళుతున్నారా ? అనేది మీరందరు గ్రహించవలసిన అతి ప్రాముఖ్యమైన సంగతి. దీనిని బట్టే సేవకుల లక్షణాలను మీరు సుళువుగా గ్రహించవచ్చు. మిమ్మును మీ కుటుంబాన్ని పొగడు వారు సేవకులెలా అవుతారు. మనందరు పొగడవలసింది, కీర్తించవలసింది, ఎరుగవలసింది తండ్రియైన దేవునిని. ఆయన అద్వితీయ కుమారులైన యేసుక్రీస్తుని మాత్రమే. ధనవంతులైన వారింటికే వెళ్లువారు అధికంగా కనబడతారని బీదలను పట్టించు కొననివారు అధికులని ఆంధ్రా అంతటా ఎందరో విశ్వాసులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితి మారాలి. సేవకులైనవారెవరైనా అందర్ని సమదృష్టితో చూడాలి. అందరి యెడల ప్రేమను కనబర్చాలి. వారెళ్ళిన ఇంటివారికి క్రీస్తును గూర్చి బోధించాలి. ఆ మాటలే విశ్వాసులైన వారి యెడల కృప చూపుతాయి. తరువాత మాత్రమే వారి క్షేమ సమాచారములకొరకు విచారించి, వారి అక్కరతలకొరకు విజ్ఞాపన చెయ్యాలి. ఆలాగున ఎవరు చేస్తారో వారు సేవకులనబడుదురని మైమిలునందున్న వచనాలనుబట్టి ఎందరో పండితులు సెలవిస్తున్నారు. ప్రియమైన విశ్వాసులూ ! మీకు తెలిసిన సేవకులు ఏ విధంగా ఉన్నారు. ఎంతసేపు లోకంలో ఉన్నవాటిని గూర్చియే మీతో మాట్లాడుతున్నారా? లేక లోకాలకు కర్తయైన దేవుని గూర్చి మాట్లాడుతున్నారాయని మీకై మీరు ఆలోచించుకొని జాగ్రత్తపడి, ప్రభువును వేడండి. ఎంతో జాగ్రత్తగా మన బ్రతుకులను క్రీస్తునందు గడపవలసిన రోజుల్లో మనమున్నాము జాగ్రత్త సుమా!

## పాఠకుల కోరికపై మరొకసారి...

ప్రియమైన 'క్రైస్తవనాడు' పాఠకులకు క్రీస్తు యేసు ప్రశస్తనామములో వందనములు. 'క్రైస్తవనాడు' పక్షపత్రిక రెండవ సంవత్సరంలో అడుగిడిన శుభ సందర్భంగా నాకెంతో సంతోషంగా ఉంది. మన ప్రభువును స్తుతించుచున్నాను. పత్రిక ఎడిటర్ వై.కె.రాజు, ఆయన కుటుంబాన్ని అభినందించుచున్నాను. పత్రిక ద్వారా నేనెంతో వాక్యమును తెలుసుకొని నూతన సంగతులు గ్రహించాను. పత్రిక రెండవ సంవత్సరములో ప్రభువు చిత్తము నెరవేర్చబడి అనేకులకు మేలుకరంగా ఉండాలని నా ఆకాంక్ష, నా ప్రార్థన.

ఎడిటర్ వై.కె.రాజు మా సంఘ సభ్యుడని తెలియజేయడానికి ఎంతో సంతోషించుచున్నాను. ఆయన పి.ఎం.పాలెంలో ఉన్నప్పుడు హిందువు. ఆయన భార్య శ్రీమతి సలోమి ముందుగా ప్రభువును అంగీకరించింది. అందువల్ల ఆయన ఇంటికి వెళ్లి వాక్యము చెప్పడానికి నాకు అవకాశం దొరికింది.ఆయన ఆయన భార్య ముంచబడిన బాప్తిస్మము తీసుకున్నారు. ఆయనలో ఉండే ప్రత్యేకత బైబిలు ఎప్పుడూ ఆయన చేతిలో ఉంచుకొనుట. బస్సులో వున్నా, ఎక్కడున్నా బైబిల్ చదువుట. ఆ రీతిగా వాక్యమును నేర్చుకొని ప్రభువులో స్థిరపడ్డారు. పెయింటింగ్ పని చేసుకుంటూ పత్రికలు వ్రాసి పంచిపెట్టుట ప్రారంభించారు. వాక్యజ్ఞానం పొంది కొంతమంది దేవుని బిడ్డల ప్రోత్సాహంతో 'క్రైస్తవనాడు' పత్రిక ప్రారంభించి జయకరంగా సంవత్సరమంతా కొనసాగించినందుకు ఆయన చాలా అభినందనీయుడు. సరిపడిన డబ్బు ఆయన చేతిలో లేకపోయినా విశ్వాసముతో ఈ గొప్ప పరిచర్యను అంకితభావంతో కొనసాగించుచున్నాడు. ప్రభువైన క్రీస్తు యేసు ఇంకా ఆయనను తన ఆత్మతో నింపి బలపరిచి ప్రతి అవసరము తీర్చి ముందుకు నడిపించు గాక!



- బ్రదర్ జి.ఎస్.జాన్

ఆహ్వానం
సత్యారాధన
ప్రతి ఆదివారం సాయంత్రం 5 గం॥లకు
అగాపే ఫుల్ గాస్పల్ చర్చ్
పెందుర్తి



వివరాలకు : పాస్టర్ బొరుస ఇశ్రాయేలు,
అగాపే ఫుల్ గాస్పల్ చర్చ్, బజాజ్ వరుణ్ మోటార్స్ భవనం వెనుక, పెందుర్తి
సెల్ : 9951353177

అల్ఫా బుక్ సెంటర్
క్రైస్తవ సంఘాలకు కావలసిన బైబిల్స్, కేలెండర్లు, స్టిక్కర్లు, వాయిద్యములు, వాగ్దానాలు లభించును

విశాఖపట్నం: అల్ఫారోడ్, ద్వారకానగర్, విశాఖపట్నం-530 016 ఫోన్ : 0891-2501513, 2754122

సికింద్రాబాద్ : గురుద్వార దగ్గర, స్టేషన్‌రోడ్, సికింద్రాబాద్-500 025 ఫోన్ : 040-27800573

విజయవాడ : 73, ఎన్.టి.ఆర్.కాంప్లెక్స్, గవర్నర్‌పేట, విజయవాడ-520 002 ఫోన్ : 2578404

అద్భుత స్వస్థత సువార్త సభలు
స్థలం : సెంటనరీ ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి ఆవరణము, అనకాపల్లి
తేదీలు : 2007 నవంబర్ 25, 26, 27
ఆది, సోమ, మంగళవారములు- ప్రతిరోజు సా॥ 6 గం॥ల నుండి

కన్వీనర్ : పాస్టర్ ప్రసన్నకుమార్, సెల్ : 9949813263,
ఇమ్మానుయేల్ ప్రార్థనామందిరం, దుడ్డుపాలెం
కో-కన్వీనర్స్ : బ్రదర్ ఉదయ్‌కుమార్, సెల్ : 9290094807,
బ్రదర్ ఫ్రెడిపాల్ : సెల్ : 9290047614

ముఖ్య ప్రసంగీకులు
పాస్టర్ సుఖ్‌చైన్ మసి గారు
(పంజాబ్)

# సకాలంలో ఇందిరమ్మ ఇళ్ళు

క్రైస్తవనాడు ప్రతినిధి, భీమునిపట్నం: భీమిలి పట్టణ, మండల పరిధిలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్ళను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనిల్‌కుమార్ సంఘాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ పథకంపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకం కింద మొదటి విడతలో మంజూరైన ఇళ్ళను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, తర్వాత రెండవ విడత ఇళ్ళ నిర్మాణం కూడా ప్రారంభించి తగిన సమయానికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. ఇళ్ళ నిర్మాణం విషయంలో తగిన నాణ్యతను పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంగివలస డిగ్రీ కళాశాల వద్ద ఇందిరమ్మ పథకంలో స్థలాలు లేని వారికి అందివ్వడానికి ఎంపిక చేసిన ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఇక్కడ రెండువేల మందికి స్థలాలు ఇవ్వడానికి నిర్ణయించగా, దాని గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం కింద ఎంపికైన ఇళ్ళ స్థలాలు లేనివారికి స్థలాలను అందించి ఇంటి రుణాలను ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటరెడ్డి, జిల్లాపరిషత్ సిఇఓ రామారావు, హౌసింగ్ డిఎం ఆది సుబ్రహ్మణ్యం మున్సిపల్ ప్రత్యేక అధికారి నాయకర్, పాల్గొన్నారు.



# చాకిరేవు



- ఎడిటర్

## సంఘాలలో బోధకుల - విశ్వాసుల పాత్ర 5

### చర్చిలేమో ఘనం- విశ్వాసుల సంఖ్య హీనం - 2

**✶ మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి... క్రీస్తుకు బెలియాలుతో ఏమి సంబంధము?**

*ప్రియులారా! పై లేఖనాలు ఎంతగా మనల్ని ఎంతగా హెచ్చరిస్తున్నాయో గ్రహించుకోవాలి. లేఖనాల్నే గౌరవించని స్థితి మనకి ఎన్నటికిని రాకూడదు. వస్తే మనం వాక్యమైన క్రీస్తును అగౌరవ పరచినట్టేనని గ్రహించుకుందాం. క్రీస్తును పరిపూర్ణంగా విశ్వసించాలి. బైబిలును సంపూర్ణంగా ఎరుగుటకు కడవరకు ప్రయత్నించాలి. బైబిలునందున్న లేఖనాన్ని మనం ఎంతబాగా ఎరిగితే మన బ్రతుకులు అంతగా ఆశీర్వదింప బడతాయని గ్రహించాలి. ఆశీర్వాదం అంటే కేవలం ధనవంతులగుటయే అని తలంచకండి. ధనంతో అన్నీ చేయగలం అనుకొనుట అవివేకమనిపిస్తుంది. దేవుడు ఏమీలేని వారిచేత ఎన్నో ఘనకార్యాలు చేయిస్తాడు. తద్వారా వచ్చే మహిమను పొందాలని ఆశిస్తాడు. అన్నీ ఉన్నవాళ్ళు చేయు కార్యాలవల్ల ఆయనకు మహిమెలా వస్తుంది? ఆలోచించండి! వారికి అన్నీ ఉండుటవలన చేయగలిగారని అందరు భావిస్తారు. అదే ఏమీలేని వారైతే వారు చేసిన కార్యాలవల్ల మహిమ దేవునికి ఆపాదించబడుతుంది. అది దేవుని కార్యంగా ప్రసిద్ధి పొందుతుంది. అందుకు ప్రామాణికంగా బైబిలు నందున్న వచనాన్ని చూద్దాం.....*

**✶ ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెర్రివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. బలవంతులైన వారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైన వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. ఎన్నికైన వారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడిన వారిని, ఎన్నికలేని వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు.**

*పై లేఖనం ఎంతో ఆశ్చర్యకరంగా అనిపించుటలేదా. తప్పక ఆశ్చర్యం కలిగించాలి. దేవుడు మనకెంతో ఆధిక్యత ఇస్తుంటే అది మరచిపోయి సంఘాల పేరున పెద్దపెద్ద బిల్డింగులు కట్టించుకొనుటయందే ఆశక్తి కనబరిస్తే బిల్డింగులే మిగుల్తాయి. విశ్వాసులు వెదికినా కనిపించరు. సేవా లక్షణాలు ఏకోశానా లేని కాపర్ల సంఘాలు ఎన్నో విశ్వాసుల జాడేలేక వెలవెల బోవుట చూస్తున్నాం. చదువరులైన మీరెటువంటి కాపరి నడిపింపులో ఉన్నారో జాగ్రత్తగా చూసుకోండి. మీ కాపరి బిల్డింగులు, స్థలాలు కూర్చుకొనుటయందే అత్యాశక్తి చూపు వాడా లేక మీ యందును శ్రద్ధకనబరుస్తున్నాడా? తెల్లవారు లేచిన దగ్గరనుండి ఆస్తులు కూర్చుకొనుటకు ధనవంతుల ఇండ్లకు పరుగులు తీస్తున్నాడా? ప్రతిరోజూ అలా పరుగులెట్టే కాపరి గొర్రెలుగా పోల్చబడిన విశ్వాసులను ఎలా కాస్తాడు. ఎలా మేపుతాడు. ఇంకెలా అభివృద్ధి పరుస్తాడు. విశ్వాసుల శుభ, అశుభ కార్యాలను ఎలా జరిపిస్తాడు. ఇన్ని అవలక్షణాలున్న ఏకాపరియైనా జీతగాడే సుమా! అటువంటి వారిని ప్రభువు ఏమన్నారంటే......*

*లేఖనాల్లోనే చూడండి..*

**✶ జీతగాడు జీతగాడే గనుక గొర్రెలను గూర్చి లక్ష్యము చేయక పారిపోవును.**

*పై దేవుని మాట ఎంత చక్కగా ఉందో మీరు చూశారు. అందునుబట్టి మీ కాపరి జీతగానివలే ఉన్నాడా? లేక మీకు ఆదరణ కలిగించు విధంగా ఉంటున్నాడా మీకై మీరే యోచించుకొనండి. మీకు నిత్యం అందుబాటులో ఉంటున్నాడా. వాక్యజ్ఞానం ఏమైనా ఉందా. దేవునిలో కుటుంబ స్థితిగతులెలా ఉన్నాయి. పిల్లలకు వాక్యాభిలాష ఉందా వారి పిల్లలకు ప్రార్థనామందిరాల్లో హాజరు ఎలా ఉంది. మొదలగునవెన్నో విషయాలు విశ్వాసులు తెలుసుకోవాలి. ఎందుకంటే మీరుకాని, మీ పిల్లలు కాని ఆదివారమైనా మరేయితర కార్య క్రమాల్లోనైనా హాజరు కాకపోతే మీ కాపర్లు ఊరుకుంటున్నారా. ఆలాగుననే మీరు కూడా పట్టించుకోవాలి. అపుడే ఒకరియందొకరు భయభక్తులు ఏర్పడి ప్రేమాభిమానాలు కలిగి ఉంటారు. అంతేగాని మాకాపరి దైవజనులు, అభిషేకమున్నవారు లాంటి అమాయక కబుర్లను కట్టిపెట్టండి. ఒకవేళ మీరన్నట్లు నిజంగా అభిషేకమున్న దైవజనులైతే ఆలాగున ప్రవర్తించరని ఎరగండి.*

*ఇంతకూ విశ్వాసులు దైవ జనులుకారా?! మనందరమును దేవుని పిల్లలమే దైవ జనులమే. క్రీస్తునందు అభిషేకించబడిన వారమే. ఇది లేఖన సత్యం. అందరూ గ్రహించుట అవశ్యం. గ్రహించనివారెవరైనా లేఖనావగాహన లేని చిన్న పిల్లలే సుమా!*

## తెలుసుకుందాం!

### సైన్స్

- ❖ అతి చిన్న పుష్పం 'వోల్ఫియా'
- ❖ క్రికెట్ బ్యాట్లను విల్లోప్లాంట్  చెట్టు చెక్కతో తయారుచేస్తారు.
- ❖ 1932 లో ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ కనుగోన్నది "క్నోల్, రుస్కా"
- ❖ ఖర్జూర పండులో మనకి ఆహారంగా పనికొచ్చేది "పెరికార్స్ భాగం"
- ❖ మొక్కలలో కిరణజన్య సంయోగక్రియ రేటును కొలిచే పరికరం 'విల్‌మాంట్స్ బబ్లర్'
- ❖ సీతాఫలంలో మనకి ఆహరంగా పనికొచ్చేది 'మిసోకార్స్ & ఎండో కార్స్ భాగాలు'
- ❖ బొప్పాయి పండులో ఆహరంగా పనికొచ్చేది 'మీసోకార్స్'
- ❖ బయాలజీ పితామహుడు "అరిస్టాటిల్"
- ❖ అల్లం మొక్కలో మనం వాడేది "కాండం"
- ❖ కారు టైర్ల తయారీలో దారం కోసం వాడే పదార్థం "నైలాన్"

### సిల్లిన్యూస్

- ❖ మన పాలపుంతలోని నక్షత్రాలను సెకనుకొకటి చొప్పున లెక్క పెట్టడం మొదలుపెడితే పూర్తయ్యేసరికి దాదాపు మూడు  వేల సంవత్సరాలు పడుతుంది.
- ❖ వాల్ట్‌డిస్నీకి ఎలుకలంటే భయం (మ్యూసోఫోబియా)
- ❖ బూట్లకు కట్టుకునే లేసుల చివరి ప్లాస్టిక్ భాగాల్ని 'ఎగ్లెట్స్' అంటారు.
- ❖ టైటానిక్ ఓడ సముద్రంలో ఐస్‌బెర్గ్‌ను ఢీకొనే సమయానికి దాని వేగం గంటకు 22 నాటికల్ మైళ్లు.
- ❖ ప్రపంచంలో ఎక్కువ మందికి తెలిసిన బ్రాండ్లు వరసగా...కోకాకోలా, మైక్రోసాఫ్ట్, ఐబీఎం.
- ❖ ఒకే నెల్లో రెండు పున్నములు వస్తే ఆ రెండో పౌర్ణమిని 'బ్లూమూన్' అంటారు. అలాగే రెండు అమావాస్యలు వస్తే రెండో అమావాస్య రోజును ' బ్లాక్‌మూన్ డే' అంటారు.
- ❖ పిల్లులు కన్నా కొన్ని వందల సంవత్సరాల ముందునుంచే ఫెర్రెట్లు మనిషికి పెంపుడు జంతువులు

### చరిత్ర...

- ❖ శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలం క్రీ॥శ॥1510-1530
- ❖ తళ్ళికోట యుద్ధం క్రీ॥శ॥1565 జరిగింది
- ❖ విజయనగర కాలం నాటి ముఖ్యమైన శిల్ప కళా చిహ్నం 'లేపాక్షి'
- ❖ శ్రీకృష్ణదేవరాయలు ఓడించిన కుతుబ్‌షాహి వంశ పాలకుడు ' కులీకుతుబ్ షా '
- ❖ మహ్మద్ కులీకుతుబ్ కాలంలో ఆంధ్రదేశం మొత్తం గోల్కొండ కుతుబ్‌షాహీల పాలన కిందికి వచ్చింది.
- ❖ నీలినీటి విధానంను అమలుపరిచినది 'అల్బుకర్క్'
- ❖ ఆంధ్రదేశంలో ఫ్రెంచివారు మొట్టమొదటిసారిగా 'మసులా' ప్రాంతంలో స్థావరాన్నేర్పరచుకున్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్‌లో 1857 తిరుగుబాటు కడప, కర్నూల్, విశాఖపట్నం.
- ❖ 1933లో మిక్కీమౌస్ క్యారెక్టర్‌కు 8లక్షల ఉత్తరాలు (ఫాన్ మెయిల్స్) వచ్చాయి.

సేకరణ, వివరణ : **వై.ఎల్. రవిరాజు**

# డియర్ ఎడిటర్...

## ✶ వివేకి అయినవాడు తన విద్యను దాచిపెట్టును

పాఠకులెందరో తమ సందేహాలకు సమాధానాలను, ✶ గుర్తు పెట్టి వ్రాయబడు లేఖనాల రిఫరెన్సులను ప్రచురించమంటున్నారు. మీ సందేహాలకు బైబిలు ప్రకారం వివరణ ఇస్తాం. ఆ వివరణలో వచ్చే వచనాలకు కూడా ఇలా ✶ గుర్తులే వాడతాము. రిఫరెన్స్‌లు తెలుసుకోవాలనే కుతూహలం కలిగినవారు ఉత్తరాల ద్వారా గానీ, ప్రత్యక్షంగా గానీ సంప్రదించి తెలుసుకోండి.

పాస్టర్ పి.సమూయేలు, ర్యాలి, తూ.గో.జిల్లా

ఎడిటర్ వై.కనకరాజు గారికి, మీరు పంపిన మన క్రైస్తవనాడు అందినది. అందున్న విషయాలు, ఆధ్యాత్మిక దేవుని సందేశాలు చదివియున్నాను. ఇలా పత్రికా ప్రచురణ ద్వారా అనేకమందికి వాక్యము అందించబడుతుంది. అనేకమంది మార్చబడతారు మరియు వాక్యం ద్వారా మేలు పొందుతారు. మీకొరకు, పత్రికా పరిచర్య కొరకు ప్రార్థిస్తాము. మా కొరకును ప్రార్థించండి.

***జవాబు : పాస్టర్ పి.సమూయేలుకు మీరు మాపై చూపుతున్న ప్రేమకు జోహార్లు. వీలు కల్పించుకుని ఉత్తరాల ద్వారా మమ్మును ప్రోత్సహిస్తూ, ఉత్సాహపరుస్తున్న మీకు వందనాలు. మా కొరకు ప్రార్థిస్తున్నారని వినుట కంటే ఆనందం ఇంకొకటి నాకు లేదు. మీ పరిచర్య ప్రభువులో బలంగా సాగాలని మేము ఆశిస్తున్నాము. ప్రార్థిస్తాము కూడా. ఉత్తర, ప్రత్యుత్తరాల ద్వారా మనం ఒకరినొకరు పురిగొల్పుతూ మరింత ముందుకు సేవలో సాగాలని ఆశిస్తుంటాను. నా ముఖ్యోద్దేశము ప్రభువైన యేసుక్రీస్తును ఆశ్చర్యకరంగా వర్ణిస్తూ లేఖనాల ప్రకారం వివరించుటయే! తద్వారా అనేకులు వాక్యం మరింతగా నేర్చుకొని బలపడాలని కోరుకుంటాను. ఇప్పటికే ఆంధ్రా అంతట నుండి అనేక ప్రాంతాల కాపరులెందరో క్రైస్తవనాడు ద్వారా అనేక ఆశ్చర్యకర వాక్యాల వివరణ తెలుసుకొంటున్నామని ఎన్నో విధాల మాకు తెలుపుతున్నారు. అందుకు దేవునికి స్తోత్రములు. భవిష్యత్‌లో బైబిలునందున్న ఎన్నో గూఢాంశాలను అందరికీ తేటపడునట్లు క్రైస్తవనాడు ద్వారా వివరించాలని నా సంకల్పం. మన తరువాత తరం వారు వాక్యంలో సులువుగా ఎదుగునట్లుండాలని నా ఆకాంక్ష. వీలైతే లోతైన మర్మాలను పుస్తకరూపంలో తేవాలని ఆశిస్తున్నాను. వీటన్నింటి విషయమై మీరంతా ప్రార్థించాలని కోరుతున్నాను.***

. . . . . . . . . . . . . . . . . . . . . . . . .

ఎన్.సామ్యూల్, ఆల్ఫా బుక్‌సెంటర్, విశాఖపట్నం

ఎడిటర్ గారికి నమస్కారాలతో ఆల్ఫా బుక్‌సెంటర్ ఎన్.సామ్యూల్ వ్రాయుట... మీరు ప్రచురిస్తున్న క్రైస్తవనాడు మ్యాగజైన్ చదివాను. నాకెంతో నచ్చినది. అందునుబట్టి చాలా సంతోషిస్తున్నాను. ప్రతినెలా ఈ మ్యాగజైన్ నాకు తప్పక పంపిస్తారని ఆశిస్తున్నాను. పత్రికా పరిచర్య కొరకు మేమెప్పుడూ ప్రార్థిస్తుంటాము.

**జవాబు : బ్రదర్ ఎన్.సామ్యూల్‌కు మీరు పెద్ద మనసుతో మాపై అభిమానం చూపి వ్రాసిన ఉత్తరం నాకెంతో ఆదరణ కలిగించింది. మీరు ఎంతో అనుభవశాలురు. మరియు రచనానుభవం గలవారు. మీకు క్రైస్తవనాడు నచ్చినది అని తెలిసిన తరువాత నేనెంతో ఆనందించాను. మీబోటి వారికి పత్రిక పంపడం నా బాధ్యతగా భావిస్తాను. మీకున్న అనుభవం మాకెంతో అవసరం. రాబోవు దినాలలో మీరు పరిచర్యలో అన్ని విధాలా మమ్మును ఆదరించాలని, మాకొరకు ప్రార్థించాలని అభిలషిస్తున్నాను. ఆల్ఫా బుక్‌సెంటర్ బ్రాంచిలన్నింటికీ పత్రికలు పంపుతాను. మీవంతు పరిచర్య మీరు మాకోసం చేస్తారని నమ్ముతున్నాం. మీ అమూల్యమైన సమయాన్ని కొంత మాకోసం వెచ్చించాలని కోరుతున్నాం. క్రైస్తవనాడు ఆంధ్రా అంతటా విస్తరించాలని ఆశిస్తున్నాము. ప్రార్థించండి.**

. . . . . . . . . . . . . . . . . . . . . . . . .

జె.ప్రతాప్‌కుమార్, విశాఖపట్నం

గౌరవనీయులైన వై.కనకరాజు గారికి నమస్కారములు. అడ్రసు లేకుండా ఉత్తరం వ్రాశానని మీరు క్రైస్తవనాడు 'డియర్ ఎడిటర్' శీర్షికలో ప్రచురించారు. ఆ పత్రిక ఒక సిస్టర్ ద్వారా నాకు అందినది. అది చదివిన నేను కొంతసేపు తర్జనభర్జన పడ్డాను. అది నన్ను ఉద్దేశించి వ్రాసినదా? లేక ఇంకెవరినైనా ఉద్దేశించి వ్రాసినదా? అని సందేహించాను. ఎందుకంటే నేను మీకు ఉత్తరం వ్రాసిన సంగతి నా సమస్యల్లో పడి మరచిపోయాను. తరువాత గుర్తుచేసుకుని నాపేరును బట్టి నేను వ్రాసిన దానికే మీరు జవాబు ఇచ్చారని గ్రహించి సంతోషించాను. వెంటనే ఉత్తరం మీకు నా అడ్రసుతో వ్రాస్తున్నాను. మొదటి ఉత్తరానికి నా అడ్రసు వ్రాయనందుకు క్షమించండి. నా పరిస్థితులను గురించి తమరు దయతో ప్రార్థించండి. అవన్నియు ఈ ఉత్తరంలో వ్రాశాను. దేవుడు మా పరిస్థితులను మార్చువిధంగా మీరు మీ ప్రార్థనలలో గుర్తుంచుకోవాలని వేడుకుంటున్నాను.

**జవాబు : బ్రదర్ జె.ప్రతాప్‌కుమార్‌కు ఈసారి అడ్రసు వ్రాశారు గానీ, ఉత్తరానికి రిజిష్టర్డ్ పోస్టులో పంపారు. పత్రికా పరిచర్యలో అనేక ప్రాంతాల్లో తిరుగుతుంటాను. కావున పాఠకులు అలా రిజిష్టర్డ్ లెటర్ పంపొద్దని నా మనవి. మీకు క్రైస్తవనాడు పత్రికలు ఇచ్చిన సిస్టర్ నా భార్య. ఆదివారం విశాఖలో గల ప్రముఖ చర్చిలలో పత్రికలను ఇస్తుంటాము. అందువలన పత్రిక మీకు అంది ఉండవచ్చు. ఏదైతేనేం మొత్తానికి అడ్రసు వ్రాయని మీకు మీ గురించే వ్రాసిన పత్రిక అందడం ప్రభువు సంకల్పమే! కాబట్టి శ్రమలయందు ఆనందించాలి. ప్రభువు దృష్టిలో వున్న మీకు ఈ శ్రమలు ఎన్నదగినవి కావు. ప్రభువు చేయు కార్యాలయందు ఎంతో విశ్వాసం మనం కనబరచాలి. అప్పుడే ఆశీర్వదింపబడతాము. మనకంటే లోకంలో ఎందరో కష్టాలు అనుభవిస్తున్నవారు వున్నారు. వారికంటే ఉన్నతులుగా మనలను ఉంచిన ప్రభువుకు మనం చేసినదేమిటి అని ఎల్లప్పుడు మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. ఈ జీవితకాలమంతా మనకొరకు మాత్రమే ఆలోచిస్తూ కూర్చుకొనుటకే ప్రయత్నిస్తే మనం క్రీస్తువారం కాలేము. మనం క్రీస్తువారమయితేనే కదా ఆయన కృపను పొందగలము.**

**ధనం ఉంటేనే మహిమ వస్తుందని, అప్పుడే గొప్పగా జీవించగలం అనుకొనుట పొరపాటు. లోకంలో ధనవంతులైనవారు ఎందరో మానసికంగా అశాంతిగా వున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయినను క్రీస్తును కలిగిన మనం శ్రమలతో వున్నామంటే కారణం... మన ద్వారా ఆయన మహిమ పొందాలనుకుంటున్నారేమో! ఆలోచించాలి. అన్నీ వున్న వారు క్రీస్తు కొరకు ఏమైనా ఘన కార్యాలు చేస్తే ఆయనకెలా మహిమ వస్తుంది? అది ఆయనకెలా ఆపాదించబడుతుంది? ఏమీ లేనివారు క్రీస్తు కొరకు చేసిన చిన్న కార్యమైనా దేవుని దృష్టిలో ఘనకార్యమే సుమా! అలాగున చేయువారిని ఆయన ఎంతో ఘనపరుస్తారు. ఎవరూ ఊహించనటువంటి ఘనకార్యాలు లోకంలో ఏమీ లేనివారిచే చేయించి, తనకు మహిమ తెచ్చుకుంటారు. ఇది లేఖన సత్యం. ధనవంతులైన వారు చేసిన కార్యాల ద్వారా వారినే లోకం మహిమపరచుట మనకు తెలిసినదే! మనబోటి వారిచే చేయబడు కార్యాలు దేవుని కరుణను, కృపను, ఆశీర్వాదాన్ని లోకానికి చాటుతాయనుటలో ఎటువంటి సందేహము లేదు. కాబట్టి శ్రమల యందు ఆనందిస్తూ క్రీస్తును మహిమ పరుద్దాం. అదే మనబోటివారికి ఆశీర్వాదమని లోకానికి, మనబోటివారనేకులకు ఎలుగెత్తి చాటుదాం.**

**గమనిక : క్రైస్తవనాడుకు ఉత్తరాలు పంపేటప్పుడు మీ చిరునామా, ఉంటే ఫోన్‌నెంబరు ఖచ్చితంగా వ్రాయవలెను. రిజిష్టర్డ్ పోస్ట్ ఎట్టిపరిస్థితుల్లోనూ పంపవద్దు. మా సమయాన్ని వృథాచేయవద్దని మనవి.**

*చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!! చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!!*

# త్వరలో...

*చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!!*

*అతి సామాన్య స్థితినుండి.... అసామాన్య స్థితికి... ఎదిగిన ఎందరో క్రైస్తవ, క్రైస్తవేతరుల "జీవనయానం" మన ఆధ్యాత్మిక, భౌతిక మేలుల కోసం..*

*చదవండి! చదివించండి! బలపడండి! బలపర్చండి.*

*- ఎడిటర్*

*చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!! చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!!*

**గమనిక: మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు.**

# మినిస్ట్రీలు చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి?

ధారావాహికం-21

- ఎడిటర్

✶గుమ్మములో నిలిచి బుద్ధిచెప్పువారి మీద జనులు పగపట్టుదురు; యదార్థముగా మాటలాడువారిని అసహ్యించుకొందురు

## స్వార్థం స్వప్రయోజనం లేని ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులు

పేతురు, అంద్రెయ, యాకోబు, యోహాను, ఫిలిప్పు, బర్తొలొమయి, తోమా, మత్తయి, యాకోబు, లెబ్బయి, సీమోను, ఇస్కరియోతు యూదా వీరు క్రీస్తు ప్రత్యక్షంగా ఏర్పరచుకున్న అపొస్తలులుగా పిలువబడుచున్న శిష్యులు. పౌలు దర్శనం ద్వారానూ, బర్నబా మొదలగువారనేకులు పరోక్షంగా ఏర్పడిన క్రీస్తు శిష్యులు.

ప్రియులారా! ఆనాడు వారందరును క్రీస్తుకు సాక్షులుగా జీవించారని నేడు మనకు తెలుసు. దీనికి బైబిలే ప్రామాణికం. శిష్యుల్లో అనేకులు పామరులు, బీదలు అని గ్రహిస్తున్నాం. అయినను వారందరు క్రీస్తుకొరకు బలీయమైన సేవచేశారు. అందువల్లే 'సువార్త' నేడు మన వరకు వచ్చింది. వారు క్రీస్తుకొరకు అనేక శ్రమలు అనుభవించినట్లు బైబిలు చెప్తుంది. చరిత్రాధారాలు కూడా వున్నవని క్రైస్తవ పండితులు, చరిత్రకారులు చెప్తున్నారు. ఎందరో వాటిని బట్టియే గాక బైబిలును బట్టి సంపూర్ణంగా క్రీస్తుసువార్త ప్రకటిస్తున్నారు. అది విన్న ఎందరో తమ మననులను క్రీస్తువైపు మరల్చుకొని క్రైస్తవులగుచున్నారు. మనం కూడా అదే కోవకు చెందిన వారమనుటలో ఎటువంటి సందేహమును లేదు. ఆనాడు వారందరు చేసిన సేవను గూర్చి మనం బహుఘనంగా చెప్పుకుంటున్నాం. అంతేగాని వారు చేసినది గ్రహించుట లేదనిపిస్తోంది. వారు క్రీస్తు సువార్త కొరకు తమ సర్వస్వాన్ని ధారపోసినట్లు స్పష్టంగా కనబడుతోంది. వారి తరువాత వారి భార్యాబిడ్డలు ఏంచేశారో, ఎలా బ్రతికారో కూడా మనకు తెలియదు. బైబిలు ఆ విషయాలు చెప్పలేదు. అంటే దేవుని సంకల్పం వారికి తెలియజేయుట వరకు మాత్రమే మోనని అన్పించకమానదు. ఆనాడు వారికున్న పేరుప్రతిష్టలు క్రీస్తును గూర్చి బోధించుట వలన మాత్రమే కలిగెనని మనం సులువుగా గ్రహించవచ్చు. పేతురు ఒక్క ప్రసంగానికే మూడువేల మంది మారినట్లు మనం ఢంకా బజాయించి బైబిలును బట్టి చెబుతుంటాం. మరి మనం ప్రసంగిస్తే ఎందరు మారుతున్నారు అని ఏనాడూ ఆలోచించునట్లు కనబడని వారుగానే అనేకులు మనకు లోకాన కనబడుతున్నారు. వారిలో కొందరు స్ట్రీట్‌లెవల్, కొందరు స్టేట్ లెవెల్, మరికొందరు నేషనల్ లెవెల్, ఇంకొందరు ఇంటర్నేషనల్ లెవెల్. ఇంతటి ఘనులుగా నేడు లోకాన కొనియాడబడుతున్న వీరి బోధల కెంతమంది మారుతున్నారు? ఆలోచించండి! మారకపోతే ఎందుకు అలా అనేకులు మారుట లేదని ఆలోచిస్తే వీరి 'స్వలాభం' కొట్టొచ్చినట్లు కన్పిస్తుంటుందని క్రైస్తవ భక్తులు ఖండితంగా చెప్తుంటారు. ప్రభువు తన వారికిచ్చిన వాగ్దానం తనకంటే వారు గొప్పపనులు చేస్తారని, అది ఆనాడు వారి జీవితాలలో నెరవేరిందన్నది సుస్పష్టం. నేడు ప్రతి ఊరిలో ఒక గొప్ప బిల్డింగు చర్చిపేరున కనబడుతుంటాయి. సేవకు వచ్చినపుడు ఏమీ లేనివారని నేడు లోకంలో ధనంతో ఎంతో ఉన్నతులుగా ఉంటూ సేవచేస్తున్నాని అనేకులు స్వసాక్ష్యమిచ్చుట మీరును ఎరిగినదే! ఏమీ లేని స్థితి నుండి వచ్చిన నేటి ఘనసేవకులెందరో అన్నీ కూర్చుకొనుటయందే అతిశయించువారిగా కన్పడుతున్నారని ఆంధ్రా అంతటా ఎందరో బహిరంగంగానే చర్చిస్తున్నారు. ఘనులని పిలువబడుచున్న ఈతరం వారు ఆస్తులు కూర్చుకొనుటయందే ఆలోచన కలిగి ఎల్లప్పుడు ఉంటారని తెలుస్తుంది. వీరి ఆస్తిదాహానికి మితిలేదని ఆస్తి సంపాదించుటలో పడి, క్రీస్తునందు ఎంత దిగజారిపోతున్నను పట్టించుకోరని చిరుపాస్టర్లు వేదన చెందుతుంటారు.

ఆస్తి కూడుతున్న కొలది క్రీస్తుసువార్త వారి విషయంలో కనుమరుగైపోతుందని చెప్తుంటారు. తమకే గాక తమ వారికందరికి అనేక సదుపాయాలు సమకూర్చుకొనుటకే అధిక సమయం వెచ్చిస్తుంటారట! బీదలైనవారికి, దీనులై సేవచేస్తున్న కాపర్లకు వీరి అపాయింట్‌మెంటు దొరుకుటే బహుకష్టం. ఎప్పుడు వెళ్లినా సార్ లేరు, సార్ కేంప్ వెళ్లారు. ఫారిన్ వెళ్లారు మొదలగు సమాధానాలే తొంభై శాతం వస్తుంటాయి. వీరు దొరికేది క్రీస్తు సేవచేసేది ఇంకెప్పుడని సేవాభారం కలిగిన కాపర్లెందరో తమ ఆవేదన తెలియపరుస్తుంటారు. సేవకులు అంటే పరిచర్య చేయువారని అర్థం. ఈ విషయమై చిరుపాస్టర్లు మాట్లాడుతూ...

వారింట్లో పనివారు వారికెప్పుడూ దొరకక, సక్రమంగా పనిచేయకపోతే వారెలా ఫీలవుతారోనని ఆలోచించుకోరా అని ప్రశ్నిస్తుంటారు. దేవుడు తమకెందుకు ఇంతటి ఉన్నత స్థితి ఇచ్చాడని వారు ఆలోచించాలని వేడుకుంటున్నారు. ఒకప్పుడు కష్టాలు అనుభవించిన వారు కాబట్టి, అటువంటి బాధలు ఇప్పుడు అనుభవిస్తున్నవారు తమకెదురైతే ఆదరించి సేదదీరుస్తారని, తద్వారా సువార్తను బలపరుస్తారనే నమ్మకంతోనే దేవుడు వీరికీస్థితి ఇచ్చాడని వీరెప్పుడు ఎరుగుతారోయని వేదన చెందుతున్నారు. అన్నీ కలుగగానే వీరి పాతస్థితి మరచి ధనవంతునిగా చెలామణి అగుటకే అధిక ప్రాధాన్యత కనబరుస్తుంటారని వీరి ప్రవర్తన చూస్తే ఇట్టే గ్రహించొచ్చని చెప్తున్నారు. చర్చిల పేరున పెద్ద పెద్ద స్థలాల్లో బిల్డింగులు వీరికి ఆస్తులు కావా? అని కూడా ప్రశ్నిస్తుంటారు. క్రీస్తుశిష్యులు ఆనాడు ఇప్పటివీరిలా ప్రవర్తిస్తే, ఆస్తులు కూర్చుకుంటే వారికి వారి పిల్లలకు ఏం కొదువ? ఆస్తిని ప్రేమించలేదు గానీ వారు క్రీస్తును ప్రేమించారు. అందుకే అన్నీ సమకూరాయి. వాటినన్నింటిని వారి వారి 'అక్కరకొలది' పంచిరని వ్రాయబడింది బైబిలులో. మరి నేడు సేవకులలో అనేకుల పరిస్థితేంటి? ఆలోచించాలి. ఎవరికి సహాయం చేస్తున్నారు. ఎవరిని ప్రోత్సహిస్తున్నారు. ఆనాటి సేవకులే కూర్చుకోవాలనుకుంటే యూదా పరిసర ప్రాంతాలెన్నో వారి పేర్లతో రిజిష్టరు అయి ఉండేవి. వారు దేవునిని మనస్ఫూర్తిగా ప్రేమించిన వారు. ధనాన్ని ప్రేమించినవారు కాదు. ఇప్పుడైతే అక్కరలేకున్నను, తమ ప్రాంతానికి అంత బిల్డింగు అవసరత లేకున్నను అమాయక క్రైస్తవభక్తిపరులను తమ మాటల చాతుర్యంతో దేవుని పేరిట బోల్తా కొట్టించి తమకనుకూలంగా తమ ఇష్టప్రకారం సంఘాల పేరున లక్షలాది రూపాయలను దుర్వినియోగ పరుచుటలో ముందుంటారు కొందరు అవకాశవాదులైన సేవకులు.

క్రైస్తవనాడు ప్రార్థినా మందిరాలను నిర్మించుటను తప్పుపట్టుట లేదని చదువరులు గ్రహించాలి. ఏదైనా ఎంత అవసరమో అంతే నిర్మించాలనే మా అభిప్రాయం లేఖనానుసారమే! ఘనమైన బిల్డింగులలో విశ్వాసులు కొందరే! సువార్తా పరిచర్య ఆ కాపరుల లిస్టులో అసలు ఉండదని తెలుస్తుంది. సువార్తకెళ్దాం అని ఎవరైనా అంటే తరువాత దినాల్లో వెళ్దాం బ్రదర్ అంటారట! అదే ధనవంతులైన క్రైస్తవుల ఇండ్లకెళ్దాం అంటే వీరు ముందుంటారని చిరుకాపర్లు మరియు విశ్వాసులు చెప్తుంటారు. ఘనంగా కట్టబడిన ఈ బిల్డింగులకు దేవాలయం అని ఒకడు పేరుపెడ్తాడు. శృంగారమనే దేవాలయం అని ఇంకొకడు పేరుపెడ్తాడు. దేవుడు ఈ బిల్డింగులో (దేవాలయంలో) ఉంటాడని మరొక వెర్రివాడు అంటుంటాడు. ఇవన్నీ లేఖనాలను ఎరిగిన మాబోటివాళ్లకు చోద్యంగానే కనబడతాయని లేఖన పండితులు ఖండిస్తుంటారు.

ప్రభువైన యేసుక్రీస్తు ఈ శరీరాన్నే దేవాలయం అని విశదపరచుట వీరు గ్రహింపరా అని అంటూ ఇంకెప్పుడు గ్రహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అపొస్తలులు కూడా దేవునిని గూర్చి సాక్ష్యం పలుకుతూ...

**✶ జగత్తును అందులోని సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువైయున్నందున 'హస్తకృతములైన ఆలయములలో' నివసింపడు.**

బైబిలు ఇంత చక్కగా వివరిస్తుంటే అది గ్రహించక తాము నిర్మించినది దేవునికి మహిమ తెస్తుందనుట ఎంతవరకు న్యాయం? ఇవ్విధంగా ప్రవర్తించువారెవరైనా దేవుని తీర్పులోనికి రాకతప్పరు జాగ్రత్తసుమా! యేసుక్రీస్తు అన్న మాట కూడా ఒకసారి చూద్దాం.

"ఆయన (యేసుక్రీస్తు) తన శరీరమును దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను"

## క్రైస్తవనాయకులు, విశ్వాసులకొకమాట!

✶ మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు ఆయనయందు మమ్మును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము.



Bro. Y.Kanaka Raju

ప్రియులారా! నేడు ప్రతివర్గానికి ఒక పత్రిక, ఒక టివి ఛానల్ కావాలనే ధోరణి స్పష్టంగా కనబడుతుంది.మనకైతే టివి చానల్లు పత్రికలు ఉన్నాయి. వాటిని బలపర్చువారే కరువయ్యారు. క్రైస్తవేతరులైతే ఈ విషయంలో మనకు భిన్నంగాఉండి బలపరిచేవారిగా కనబడ్తున్నారు. వారి వారి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమ ఉనికిని లోకానికి ఘనంగా తెలియజేస్తున్నారు. మనవాళ్ళలో ఈ విషయంపై పెద్దగా ఆశక్తిలేదని నా అనుభవం చెప్తుంది. ఎందుకూ అని ఆలోచిస్తే నాయకుల లోపం స్పష్టంగా కనబడ్తుందనేది నిర్వి వాదాంశం. మినిస్ట్రీల అధిపతులు, నాయకులు ఎవరైనా కానీవండి వారికేదో క్లిష్ట పరిస్థితులు ఎదురైతేనే మీడియా గుర్తొస్తుంది. అయితే వారు చెప్తున్నదీ ఆలోచింపదగినదే. అదేదనగా నేడు అనేక పత్రికలు పుడ్తున్నాయి. ఏది ఉంటుందో ఏది ఉండదో తెలియట్లేదు. మునుపటిరోజుల్లో మాకొక పత్రికొచ్చేది. మేము ఆదరించాము. తరువాత అది రావట్లేదు. రావట్లేదని మేం చాలా బాధపడ్డాం. ఇలాంటి అభిప్రాయాలే క్రైస్తవనాయకులు, విశ్వాసులు ఎందరో మాతోకూడా చెప్పారు. వారందరికి క్రైస్తవనాడు విన్నపం ఏమంటే.... మీకొచ్చే పత్రిక రిజిస్ట్రార్ ఆఫ్‌న్యూస్‌పేపర్స్ ఇండియా (RNI) వారి అనుమతి పొందిందా? పోస్టల్‌శాఖ అనుమతితో తక్కువఖర్చుతో మీకొస్తుందా? అని ముందుగా చూడాలి. అపుడు కొంత నమ్మాలి. తరువాత పత్రికలో ప్రస్తావించబడుచున్న అంశాలేమిటి అని చూడాలి. **మన ప్రభువైన యేసుక్రీస్తుని ఘనపర్చని ఏపత్రికైనా దేవుని దృష్టిలో గుర్తింపులేనిదేనని తెలుసుకొనుట క్రైస్తవులకు ప్రాముఖ్యమైన సంగతని గుర్తెరగాలి.** పత్రికలో ప్రభువుని ఏవిధంగా ఘనపరుస్తున్నారు. బైబిలుకు పత్రిక వారు ఇచ్చే స్థానమేమిటి. పత్రిక దేశకాలమాన పరిస్థులను తెలియజేస్తుందా. మన కుటుంబానికి ఆశీర్వాదకరంగా ఉంటుందా. మనపిల్లలకు తెలివితేటలు పెపొందింపజేయు శీర్షికలున్నాయా? అన్నివిధాలా ప్రభువుకు మహిమకరంగా ఉందా. మనబ్రతుకులను ప్రభువులో తీర్చిదిద్దుతూ సరిచేయు శీర్షికలున్నాయా. పక్షపాతంలేకుండా అందర్నీ ప్రభువులో నడిపించునట్లు ఖండిస్తూ, సరిచేయు వ్రాతలు అందున్నవా. మొదలగు ప్రాముఖ్యమైన అంశాలు పత్రికలో ప్రస్తావించ బడుచున్నవా లేదా అని చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. అటువంటి ప్రత్యేకతలున్న ఏ పత్రికైనా నిలబడుతుంది. దాన్ని బలపరచవలసిన బాధ్యత మీదే. మీరు కోరు అంశమైదైనా అది భారత రాజ్యాంగానికి లోబడేదైతే క్రైస్తవనాడు ఘనంగా ప్రకటిస్తుంది. క్రైస్తవలోకం ఆధ్యాత్మికంగా ప్రభువులో ఎదుగుటకు ఒక బలమైన సాధనంగా క్రైస్తవనాడు ఉంటుందని ఒకసారి చదివితే మీకే స్పష్టంగా తెలుస్తుందనే నమ్మకం ఎడిటర్‌గా నాకుంది. మీరందరూ ఆదరించినట్లైతే నేటి దినాల్లో క్రైస్తవనాడు క్రీస్తుని ఘనంగా ప్రకటించు పత్రిక అని వేనోళ్ళ కొనియాడబడునట్లు తీర్చిదిద్దుతాం. మరిన్ని క్రొత్త శీర్షికలతో మీ ముందుంటాం. పక్షపాతం ఏకోశానాలేని పక్షపత్రిక క్రైస్తవనాడు అని జగమెరుగునట్లు మావంతు బాధ్యతమేం సంపూర్ణంగా నిర్వర్తించుటకు ప్రయత్నిస్తాం. మాకొరకు ప్రార్థించుడి.

RNI APTEL/2006/17980

✶ నరుల అహంకార దృష్టి తగ్గింపబడును



## యుపిఎఫ్ దేవుని కార్యాలు

# పాడేరు దైవసేవకుల సదస్సు




Bishop Dr. **K. JOHN PETER**
*Founder & President*
*U.P.F.W.A., Vizag*

**బిషప్** డా॥కె.జాన్‌పీటర్ పాడేరులో దైవసేవకుల సదస్సులో ప్రసంగించారు. ప్రసంగం ఆద్యంతం సేవకులను బలపరచి నట్లుసాగింది. రోమా 5:7 వచనాన్ని గూర్చి వివరించారు. లేఖనం ప్రకారం క్రీస్తు మనల్ని ఎలాగున చేర్చుకొని రక్షించి కాపాడుతున్నారో ఆలాగుననే మనం కూడా ఒకరిని ఒకరు చేర్చుకొని ఆదరించునట్లుండాలన్నారు. ఆ విధంగా ఎవరైతే మినిస్ట్రీ (పరిచర్య) జరగిస్తారో వారు తండ్రిచేత ఆశీర్వదింపబడతారన్నారు. పాస్టర్లను బలపరచు సంగతులెన్నో విశదీకరించారు. ఒకప్పటి స్థానిక కాపరి జె.సి. ఆల్బర్ట్ మరియు వి.స్టీవెన్‌లు ఆ ప్రాంత కాపర్లందరిని కూడగట్టారు. పాడేరు పరిసరప్రాంత కాపర్లలో అనేకులు వచ్చి సదస్సును విజయవంతం చేశారు. పాడేరు పరిసర ప్రాంత మండలాల్లో వున్న వారందరిని ఆహ్వానించినట్లు సదస్సు నిర్వాహకులు చెప్పారు. యుపిఎఫ్ వారి పరిచర్యలు పాడేరులో ప్రారంభించబడినట్లే. పాడేరు ప్రాంత పరిస్థితులనుబట్టి యుపిఎఫ్ వారు తమ సంస్థలో ఆ ప్రాంత కాపర్లు చేరుటకు అతి తక్కువ రిజిస్ట్రేషను ఫీజు పెట్టారు. చూడాలి ముందు ముందు పాడేరు పరిసర ప్రాంత కాపర్లెంతవరకు దాన్ని ఉపయోగించుకుంటారో వారు యుపిఎఫ్‌లో చేరితే ఆ ప్రాంతంలో పరిచర్యలు చేస్తున్న ఇతర మినిస్ట్రీల వారి ఆలోచనలు తమపట్ల ఎలా ఉంటాయోనని కొందరు అనుమానం వెలిబుచ్చుతున్నారు. అత్యధిక శాతం మినిస్ట్రీలవారు ఏజెన్సీ సేవకులపైనే ఆధారపడి మినిస్ట్రీలను జరుపుచున్నారని వినికిడి. వారిని చూపించే విదేశీయుల సహాయం అధికంగా పొందుతున్నారనియు వినబడుతుంది. ఏజెన్సీలో క్రీస్తు సేవబలంగా జరుగుటకే, సువార్తికులను బలపర్చుటకే ప్రభువే ఈ కార్యాలను జరిగిస్తున్నారేమోనని కొందరు ఆనందపడుతున్నారు. సేవలో మినిస్ట్రీల మధ్య సహృద్భావ పోటీ అనివార్యమే! రాబోయే రోజులే ఏజెన్సీ సేవల గురించి సాక్ష్యమిస్తాయని ఆశిస్తున్నవారును లేకపోలేదు. ఏదైతేనేం మనప్రభువైన యేసుక్రీస్తును బలంగా, జ్ఞానయుక్తంగా, దైవికంగా ప్రకటించువారికి మంచి రోజులు ఇప్పుడూ ఉన్నాయి, ఎప్పుడూ ఉంటాయి అని అందరూ గుర్తెరుట మంచిదని సువార్తా భారం కలిగిన కాపరులనేకులు తలంచుచున్నారు. ప్రభువు తన కృపను అంతటా, అన్నిటా విస్తరించునుగాక.



వి.స్టీవెన్



జె.సి. ఆల్బర్ట్



ప్రసంగం



విశ్వాసులు

✶ తండ్రి కుమారుని ప్రేమించుచు, తాను చేయువాటినెల్లను ఆయనకు అగుపరచుచున్నాడని...
మీరు ఆశ్చర్యపడునట్లు వీటికంటె ఘనమైన కార్యములను ఆయనకు అగుపరచును.

"వాక్యానుసార పరిచర్య" రాబోవు రోజుల్లో
మరెంతో ఘనంగా జరిగించాలని ఆకాంక్షిస్తూ.....

డా॥ కె.జాన్ పీటర్ గార్కి

జన్మదిన శుభాకాంక్షలు





_ వై.కనకరాజు & ఫ్యామిలీ

✶ ....దుష్టుల దోషమును బట్టియు నేను వారిని శిక్షింపబోవుచున్నాను

Printed & Published and Edited, Owned by Y.Kanaka Raju, 17-108, Sanjay Gandhi Colony, Hanumanthavaka Junction,opp. L.V. prasad Eye Institute, Visakhapatnam - 530 040, Andhra Pradesh, Ph : 9346960601,9849134647. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20